# ప్రవక్త (ﷺ) జన్మదిన మిలాదున్నబీ వేడుకలు

﴿ حكم الاحتفال بذكرى المولد النبوي ﴾

[ తెలుగు – Telugu – تلغو ]

Saleh Bin Fawzaan al-Fawzaan

**అనువాదం :** ముహమ్మద్ కరీముల్లాహ్

**రివ్యూ :** షేఖ్ నజీర్ అహ్మద్

2011 - 1432

IslamHouse.com

# ﴿ حكم الاحتفال بذكرى المولد النبوي ﴾

« باللغة تلغو »

صالح بن فوزان الفوزان

ترجمة: محمد كريم الله

مراجعة: شيخ نذير أحمد

2011 - 1432

IslamHouse.com

# احتفال بعيد المولد النبوي

# ప్రవక్త (ﷺ) జన్మదిన మిలాదున్నబీ వేడుకలు

www.islamhouse.com


صالح الفوزان

**సంకలనం:** షేఖ్ సాలెహ్ అల్ ఫౌజాన్

**అనువాదం:** ముహమ్మద్ కరీముల్లాహ్

Copyright ©

ఈ పుస్తకం ఒరిజినల్ గా www.islam-qa.com వెబ్సైటు నుండి తీసుకోబడింది.

ఈ పుస్తకానికి కాపీ రైటులైమీ లేవు. విషయాలను అసందర్భంగా పేర్కొనడం లేక ఆర్థిక ప్రయోజనాల కొరకు వాడడాన్ని మినహాయించి, విద్యాసంబంధమైన అవసరాల కొరకు ఈ పుస్తంలో నుండి ఏదైనా భాగం లేదా మొత్తం భాగాలు వాడుకోవచ్చు.

ఈ పుస్తకంలోని విషయాలు ఇస్లామిక్ రిసోర్సెస్ యొక్క ఇంగ్లీషు విభాగం ద్వారా క్షుణ్ణంగా పరిశీలించబడిన తరువాతనే, ఇది ప్రచురించబడి, పంపిణీ చేయబడుతున్నది. రిఫరెన్సు – ఫార్మ్ నెం 3168, తేదీ 1.3.1425హి.

ఈ ప్రచురణ గురించి ఒకవేళ మీరేదైనా సవరణలు, సరిదిద్దులు, సలహాలు సూచించదలిస్తే, సంకోచించకుండా, దయచేసి **telugu@islamhouse.com** ఈమెయిల్ తో సంప్రదించండి.

This book was originally taken from www.islam-qa.com.

This book is not copyrighted. Any or all parts of this book may be used for educational purposes as long as the information used is not in any way quoted out of context or used for profit.

This material has been reviewed and forwarded for publishing and distribution by the English language section of the Department of Islamic Resources.

Form #: 3168
Date: 1/3/1425

If you have any corrections, comments, or questions about this publication, please feel free to contact us at:

**telugu@islamhouse.com**

**www.islamhouse.com**

بسم الله الرحمن الرحيم

ఖుర్ఆన్ మరియు సున్నతులలో అల్లాహ్ మరియు ఆయన ప్రవక్త (ﷺ) ఆజ్ఞలను విధిగా అనుసరించటం గురించి మరియు ధర్మంలో నూతన కల్పితాలు (బిదాఅలు) చేర్చటం నిషేధింపబడటం గురించి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయి. ఉదాహరణకు: కొన్ని ఖుర్ఆన్ వచనాల భావానువాదం -

**" (ఓ ముహమ్మద్!) ఇలా ప్రకటించు: 'ఒకవేళ మీరు నిజంగా అల్లాహ్ ను ప్రేమించేవారే అయితే, నన్ను అనుసరించండి - అల్లాహ్ మిమ్మల్ని ప్రేమిస్తాడు మరియు మీ పాపాలను క్షమిస్తాడు. అల్లాహ్ అమితంగా క్షమించేవాడూ, అపారంగా కరుణించేవాడూనూ. ' " (3: 31)**

**"(ఓ ప్రజలారా) మీ ప్రభువు నుండి మీకు పంపబడిన దివ్యసందేశాన్నే అనుసరించండి. ఆయనను కాకుండా, ఇతర సహాయులను అనుసరించకండి. మీరు చాలా తక్కువగా గుర్తుంచుకుంటారు." (7:3)**

**"... నిశ్చయంగా ఇదే నా ఋజుమార్గం. కాబట్టి దీనినే అనుసరించండి. వేరే మార్గాలను అనుసరించకండి – అవి మిమ్మల్ని ఆయన మార్గం నుండి వేరు చేస్తాయి. వీటి గురించి ఆయన మిమ్మల్ని ఇలా ఆజ్ఞాపిస్తున్నాడు – తద్వారా మీరు (అల్లాహ్ పట్ల) భయభక్తులు గలవారు కావాలనీ"(6: 153)**

ప్రవక్త (ﷺ) ఇలా ప్రకటించినారు:

"అత్యంత సత్యమైన పలుకు - అల్లాహ్ యొక్క గ్రంథం. మరియు అత్యంత ఉత్తమమైన మార్గదర్శకత్వం - ముహమ్మద్ యొక్క మార్గదర్శకత్వం. మరియు అత్యంత నీచమైనది – ధర్మంలో నూతన విషయాలను కల్పించటం"

మరోచోట ఆయన (ﷺ) ఇలా ప్రకటించినారు:

> “మా యొక్క ఈ విధానంలో (ఇస్లాంలో) ఏదైనా నూతన విషయం కల్పిస్తే, అది దానిలో భాగంగా కలిసిపోదు, అది తిరస్కరించబడుతుంది.” (బుఖారీ & ముస్లిం)

ముస్లిం హదీథు గ్రంథంలో నమోదు చేయబడిన హదీథులో ఇలా ఉంది,

> “మా యొక్క ఈ విధానాన్ని (ఇస్లాంను) అనుసరించకుండా; ఎవరైనా, దేనినైనా ఆచరించినట్లయితే, అది తిరస్కరించబడుతుంది.”

ప్రతి సంవత్సరం రబ్బిల్ అవ్వల్ నెలలో మిలాదున్నబీ అనే పేరుతో ప్రవక్త (ﷺ) జన్మదిన వేడుకలు జరుపుకోవటమనేది ప్రజలు కనుగొన్న నూతన కల్పితాలలోని ఒక గర్హనీయమైన నూతన కల్పితం (బిదాఅ). వారు దీనిని వివిధ పద్ధతులలో జరుపుకుంటున్నారు: ఉదాహరణకు,

· అందరూ ఒకచోట చేరి, మిలాదున్నబీ గాథ చదవే సమావేశంగా మాత్రమే దీనిని కొందరు జరుపుకుంటారు. పిదప వారు ఈ సందర్భానికి సంబంధించిన ఉపన్యాసాల మరియు కవితల (ఖసీదాల) కార్యక్రమాలు కొనసాగిస్తారు.

· కొందరు మంచి విందుభోజనం, స్వీట్లు మొదలైన వాటిని తయారు చేసి అక్కడ సమావేశమైన ప్రజలకు తినిపిస్తారు.

· కొందరు మస్జిదులలో, మరికొందరు ఇళ్ళల్లో ఈ వేడుకలను జరుపుకుంటారు.

· కొందరు పైన ఉదహరించిన పనుల వరకే తమను తాము పరిమితం చేసుకోరు; ఈ సమావేశాలలో స్త్రీపురుషులు విచ్చల విడిగా, కలిసిమెలిసి డాన్సు చేయటం, పాటలు పాడటం, సహాయం చేయమని ప్రవక్త (ﷺ) నే తిన్నగా వేడుకోవటం, ఆయనను పిలవటం, తమ శత్రువులకు వ్యతిరేకంగా ఆయన సహాయాన్ని అర్థించటం వంటి షిర్క్ పనులకు పాల్పటం మొదలైన హరామ్ మరియు గర్హనీయమైన పనులు కూడా జరుపుతారు.

అది ఏరూపంలో ఉన్నా గానీ, దానిలో పాల్గొనేవారి ఉద్దేశాలు ఏవైనా గానీ, నిస్సందేహంగా నూతన కల్పితాలన్నీ హరామ్ కల్పితాల క్రిందికే వస్తాయి. మూడు ఇస్లామీయ ఉత్తమ శతాబ్దాలు గడిచాక, షియా ఫాతిమీయులచే మిలాదున్నబీ అనే ఈ నూతన కల్పితాలు ప్రజలకు పరిచయం చేయబడినాయి. వారు ముస్లింల ధర్మాన్ని కలుషితం చేయటానికే ఇలా చేసారు. వారి తరువాత ఈ పనిని మరలా పునరుద్ధరించిన వ్యక్తి అంటే ఈ నూతన కల్పితాలను తిరిగి ప్రజలకు పరిచయం చేసిన వ్యక్తి అల్ ముజఫ్ఫర్ అబూ సయీద్ కజ్కబూరి అనే ఇర్బిల్ దేశపు రాజు. ప్రసిద్ధ చరిత్రకారుడు ఇబ్నె ఖల్కాన్ (అల్లాహ్ ఆయనపై దయజూపు గాక) మరియు ఇతర చరిత్రకారులు పేర్కొన్నట్లు, అతడు 6వ శతాబ్దపు చివరిలో లేదా 7వ శతాబ్దపు ఆరంభంలో పరిపాలించాడు.

అబూ షామహ్ (అల్లాహ్ ఆయనపై దయజూపు గాక) ఇలా పేర్కొన్నారు: "మోసుల్ పట్టణంలో మొట్టమొదట షేఖ్ ఉమర్ ఇబ్న ముహమ్మద్ అల్ మలా అనే అతను వాటిని (మినాదున్నబీ వేడుకలను) చేసాడు. సత్యమార్గాన్ని అనుసరించేవానిగా అతను ప్రజలలో పేరు సంపాదించాడు. ఆ తరువాత ఇర్బిల్ రాజు మరియు ఇతరులు అతని ఉదాహరణను అనుసరించడం మొదలెట్టారు."

ఇబ్నె కథీర్ (రహిమహుల్లాహ్) తన 'అబూ సయీద్ కజ్కబూరి జీవితచరిత్ర' అనే పుస్తకంలో ఇలా వ్రాసారు: "రబ్బిల్ అల్ అవ్వల్ నెలలో అతడు మిలాదున్నబీ పండుగను చాలా ఘనంగా జరిపేవాడు. అల్ ముజఫ్ఫర్ పండుగలలో కొన్నిసార్లు పాల్గొన్న కొందరు ప్రజలు వాటి ఆర్భాటాన్ని ఇలా వివరించారు – వాటిలో అతడు ఐదు వేల గొర్రెల తలలు మరియు పది వేల కోళ్ళు వేయించి, ఒక లక్ష పెద్ద పెద్ద భోజన పళ్ళాలను మరియు ముప్పై స్వీట్ల పళ్ళాలను ఏర్పాటు చేసేవాడు. సూఫీలు దొహర్ నుండి మరుసటి రోజు ఫజర్ వరకు పాటలు పాడేవారు. ఆయన స్వయంగా వారితో కలిసి, డాన్సు చేసేవాడు."

ఇబ్నె ఖల్కాన్ (అల్లాహ్ ఆయనపై దయజూపు గాక) ఇలా పేర్కొన్నారు: “సఫర్ నెల ఆరంభం కాగానే ప్రజలు ఆ గుమ్మటాలను జిగేలుమనిపించేలా రకరకాల తళుకు మెళుకు అలంకరణలతో ముస్తాబు చేసేవారు. ప్రతి గుమ్మటంలో గాయకుల ఒక గుంపు, వారిని సమర్ధించే తమాషారాయుళ్ళు మరియు సంగీతకారులు కూర్చునేవారు. వారు ఇలాంటి ఏర్పాట్లు చేయకుండా ఏ గుమ్మటాన్నీ వదిలిపెట్టేవారు కాదు. వేడుకల కాలంలో ప్రజలు తమ పనులకు హాజరవకుండా సెలవు తీసుకుని, అటూ ఇటూ తిరుగుతూ, ఈ తమాషాలను చూస్తూ గడిపేవారు. మిలాదున్నబీ పండుగ దినానికి రెండు రోజుల ముందు, వివరించనలవి కానంత అధికంగా వారు ఒంటెలను, ఆవులను, గొర్రెలను తీసుకువచ్చేవారు. తమ వద్ద నున్న అన్నిరకాల డప్పులు మరియు సంగీత వాద్యాలు వాయిస్తూ, పాటలు పాడుతూ వాటి వెంట కోటకు చేరుకునేవారు. మిలాదున్నబీ రాత్రి, మగరిబ్ నమాజు తరువాత కోటలో నషీద్ పాటల ప్రదర్శన ప్రారంభమయ్యేది.”

ప్రవక్త ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం పుట్టినరోజు సందర్భంగా, ఈ మిలాదున్నబీ వేడుకలు జరపటమనేది ఇలా ప్రారంభమైంది. అనవసరమైన ప్రదర్శనలు మరియు తమాషాలు, దుబారా ఖర్చులు, ధనం మరియు సమయం వృథాగా ఖర్చుచేయటం మొదలైనవి ఈ వేడుకలలో ఈ మధ్య చేరిపోయాయి. అయితే, నిజానికి ఈ మిలాదున్నబీ వేడుకలు జరుపమని అల్లాహ్ ఎలాంటి ఆదేశం పంపి ఉండలేదు.

సున్నతును పునరుద్ధరించటం మరియు నూతన కల్పితాలను (బిదాఅలను) అంతం చేయటమనేది ముస్లింలందరి కర్తవ్యం; ఎవరైనా ఏదైనా పని చేయాలని అనుకుంటే, దాని గురించి అల్లాహ్ యొక్క ఆదేశం ఏమిటనేది తెలుసుకోకుండా, వారు ఆ పని చేయకూడదు.

వాస్తవానికి ముహమ్మద్ (ﷺ) యొక్క మిలాదున్నబీ జన్మదిన వేడుకలు జరపటం నిషిద్ధం, హరామ్. ఈ మిలాదున్నబీ వేడుక తిరస్కరింపబడుతుందని చెప్పటానికి అనేక కారణాలు ఉన్నాయి: వాటిలో కొన్ని -

1 – ఇది ప్రవక్త (ﷺ) యొక్క సున్నతులలో లేదా ఆయన తరువాత వచ్చిన ఖలీఫాల విధానంలో కనబడదు. దీని కారణంగా ఇది నిషిద్ధమైన నూతన కల్పితం (హరామ్ అయిన బిదాఅ). ఎందుకంటే ప్రవక్త (ﷺ) ఇలా ఉపదేశించారు:

"నా సున్నతును మరియు సరైన మార్గంలో నడిచిన నా తరువాతి ఖలీఫాలను అనుసరించమని నేను మీకు విజ్ఞప్తి చేస్తున్నాను; దానినే అవలంబించండి మరియు దానినే గట్టిగా పట్టుకోండి. నూతనంగా కల్పించబడే వాటి నుండి జాగ్రత్త పడండి, ఎందుకంటే నూతనంగా చేర్చబడే ప్రతిదీ ఒక కల్పితమే (బిదాఅ) మరియు ప్రతి నూతన కల్పితం (బిదాఅ) మార్గభ్రష్టత్వం వైపునకు తీసుకు పోతుంది." (అహ్మద్ & అత్తిర్మిధీ)

'మిలాదున్నబీ జన్మదిన వేడుక' మూడు ఉత్తమమైన ఇస్లామీయ శతాబ్దాలు గడిచిన తరువాత, షియా ఫాతిమీయులచే ముస్లింల ధర్మాన్ని కలుషితం చేయటానికి, పరిచయం చేయబడిన నూతన కల్పిత ఆచరణ (బిదాఅ). ఒకవేళ ఎవరైనా వ్యక్తి, అల్లాహ్ కు దగ్గరవ్వాలనే ఉద్దేశంతో; ప్రవక్త (ﷺ) చే స్వయంగా ఆచరించబడని మరియు ఆయనచే ఆజ్ఞాపించబడని, ఆయన తరువాత వచ్చిన ఖలీఫాలచే ఆచరించబడని ఏదైనా పని చేస్తే, అది ప్రజలకు ధర్మాన్ని పూర్తిగా వివరించలేదని ప్రవక్త (ﷺ) పై ఆరోపించినట్లవుతుంది. అంతేగాక అతను సూరహ్ మాయిదహ్, మూడవ ఆయతులోని అల్లాహ్ యొక్క ఈ పలుకులను విశ్వసించ నట్లవుతుంది. (అల్లాహ్ పలుకుల భావం యొక్క అనువాదం):

**"ఈ దినమున నేను మీకొరకు మీ ధర్మాన్ని పరిపూర్ణం గావించాను. అలాగే మీపై నా అనుగ్రహాన్నీ, పరిపూర్తి చేసాను మరియు ఇస్లాంను మీకొరకు ధర్మంగా ఆమోదించాను.." (దివ్యఖుర్ఆన్ 5: 3)**

...ఎందుకంటే అలా చేసేవాడు ప్రవక్త (ﷺ) తీసుకురాని ఒక అదనపు విషయాన్ని కల్పించి, అది ధర్మంలోని భాగమేనని దావా చేస్తున్నాడు.

2 – ఈసా అలైహిస్సలాం జన్మదిన వేడుకలు జరుపుకోవటమనేది క్రైస్తవుల పద్ధతి. మరి, వారి వలే, ప్రవక్త (ﷺ) యొక్క జన్మదిన వేడుకలను మిలాదున్నబీ పేరుతో జరుపుకోవటమనేది క్రైస్తవులను అనుసరించినట్లే కదా! ఇస్లాంలో ఇతర ధర్మాలను అనుసరించటం పూర్తిగా నిషేధించబడింది. కాఫిర్లను అనుసరించటం మరియు అనుకరించటం నిషేధించబడిందని, వారికి భిన్నంగా ఉండవలెనని ఈ క్రింది హదీథులు తెలుపుతున్నాయి.

ఈ హదీథులలో ప్రవక్త (ﷺ) ఇలా ఉపదేశించారు:

"ఎవరైనా ఇతరులను అనుకరిస్తే, వారు కూడా వారి వలే అయిపోతారు" (అహ్మద్ & అబూ దావూద్).

మరో సందర్భంలోఆయన ఇలా ఉపదేశించారు,

"ముష్రకులకు (బహుదైవారాధకులకు) భిన్నంగా ఉండండి." (ముస్లిం హదీథ్)

...ప్రత్యేకంగా వారి ధర్మ చిహ్నాలకు, ఆచరణలకు సంబంధించిన వాటి నుండి.

3 – నూతన కల్పితాలు (బిదాఅ) చేర్చటం మరియు క్రైస్తవులను అనుసరించడమనేవి రెండు హరామ్ ఆచరణల క్రిందికి వస్తాయి. అంతేగాక, ప్రవక్త (ﷺ) జన్మదిన వేడుకలు జరపటమనేది ఈరోజుల్లో జరుగుతున్నట్లుగా ఆయనను గౌరవించటంలో హద్దుమీరటం, అతిగా ప్రవర్తించటం, అల్లాహ్ ను వదిలి ఆయను వేడుకోవటం, ఆయన సహాయాన్ని అర్థించటం మొదలైన వాటి వైపునకు దారితీస్తుంది. ఈనాడు, మిలాదున్నబీ వేడుకలు జరుపుకుంటున్న వారిలో చాలా మంది, అల్లాహ్ ను వదిలి, ప్రవక్త (ﷺ) ని పిలుస్తున్నారు,

సహాయం కొరకు అర్థిస్తున్నారు, ఆయనను స్తుతిస్తూ ఖసీదతుల్ బుర్దా వంటి షిర్క్ తో కూడిన కవితలు (ఖసీదాలు) పాడుతున్నారు. తనను పొగడటంలో హద్దుమీరటాన్ని ప్రవక్త (ﷺ) స్వయంగా ఇలా నిషేధించారు:

"మర్యం కుమారుడిని క్రైస్తవులు స్తుతించినట్లు నన్ను స్తుతించకండి. నేను కేవలం ఆయన (అల్లాహ్) దాసుడిని మాత్రమే, కాబట్టి నన్ను అల్లాహ్ దాసుడిగా ఆయన సందేశహరునిగా మాత్రమే పిలవండి." (బుఖారీ హదీథు)

... i.e., క్రైస్తవులు ఈసా అలైహిస్సలాంను స్తుతించటంలో మితిమీరినట్లు, మీరు నన్ను స్తుతించటంలో మితిమీరి పోవద్దు. క్రైస్తవులు ఆయనను గౌరవించడంలో ఎంతగా హద్దుమీరి పోయారంటే, వారు అల్లాహ్ ను వదిలి, ఆయననే ఆరాధించటం మొదలు పెట్టేసారు. ఖుర్ఆన్ లో తెలిపినట్లుగా, వారు అలా చేయడాన్ని అల్లాహ్ నిషేధించాడు: ఖుర్ఆన్ వచన భావానువాదం,

**"ఓ గ్రంథప్రజలారా! మీ ధర్మం విషయంలో అతిగా ప్రవర్తించకండి. అల్లాహ్ పట్ల సత్యం తప్ప మరింకేమీ పలుకకండి. నిశ్చయంగా మసీహ్ (క్రీస్తు) అయిన మర్యం కుమారుడు ఈసా, అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ఆయన యొక్క వాక్కు; ఆయన దానిని (వాక్కును) మర్యం వైపునకు పంపినాడు – మరియు ఆయన నుండి (పంపబడిన) ఆత్మ మాత్రమే. కనుక అల్లాహ్ ను ఆయన సందేశహరులను విశ్వసించండి. మరియు మీరు (అల్లాహ్ ను) 'ముగ్గురు' అనకండి. (అలా అనడం) మీరు మానుకోండి. అదే మీ కొరకు శుభప్రదమైనది. నిశ్చయంగా, ఏకైకుడైన అల్లాహ్ ఒక్కడే ఆరాధనలకు అర్హుడు. ఆయనకు కుమారుడు ఉన్నాడనే విషయాన్నుండి ఆయన పరిశుద్ధుడు, పవిత్రుడు. ఆకాశాలలోనూ, భూమిలోనూ ఉన్నదంతా ఆయనకు చెందినదే. మరియు కార్యసాధకునిగా కేవలం అల్లాహ్ యే చాలును." (ఖుర్ఆన్ 4: 171).**

వారు చేసిన తప్పే మనం కూడా చేయకుండా ఆపటానికి, మితిమీరి తనను స్తుతించవద్దని మన ప్రవక్త (ﷺ) మనల్ని ఇలా వారించారు:

"హద్దుమీరటాన్ని గురించి జాగ్రత్త వహించండి. ఎందుకంటే మీకంటే ముందు వచ్చిన ప్రజలు అలా హద్దుమీరటం వలన నాశనమైపోయారు."(అన్నిసాయి)

4 – ప్రవక్త (ﷺ) యొక్క మిలాదున్నబీ వేడుకలు జరపటమనేది ఇతర నూతన కల్పితాల (బిదాఅల) వైపునకు దారి చూపి, సున్నతు దారి నుండి తప్పిస్తుంది. కనుక నూతన కల్పితాలలో (బిదాఅలలో) మునిగి ఉన్నవారు, వాటిలో చాలా చురుకుగా పాల్గొనడాన్ని మరియు సున్నతు ఆచరణలలో చాలా నెమ్మదిగా, బద్ధకంగా ఉండటాన్ని మీరు చూసే ఉంటారు. ఒకవిధంగా సున్నతులను వారు అసహ్యించుకుంటారు, వాటిని ఆచరిస్తున్నవారిని శత్రువుల వలే చూస్తారు. మొత్తం ధర్మంలో రకరకాల నూతన కల్పితాలను మరియు మిలాదున్నబీలను నింపటమే వారి లక్ష్యం. వారు అనేక వర్గాలుగా విభజింపబడి ఉన్నారు. ప్రతి వర్గం తమ ఇమాముల, వలీల జన్మదిన వేడుకలు జరుపుతుంది. ఉదాహరణకు అల్ బదవీ, ఇబ్నె అరబీ, అల్ దాసూఖీ మరియు అల్ షాధిలీ మొదలైనవి. ఒక వలీ జన్మదిన వేడుకలు పూర్తి కాగానే, మరొక వలీ జన్మదిన వేడుకల తయారీ మొదలైపోతుంది. చనిపోయిన ఆమహాపురుషులను మరియు ఇతరులను గౌరవించడంలో హద్దుమీరిపోవటం; అల్లాహ్ ను కాకుండా వారినే పిలవటం, అర్థించడం, వేడుకోవడం; వారు తమకు లాభనష్టాలు, కష్టసుఖాలు కలుగజేయ గలరని నమ్మటం వంటివి చివరికి అల్లాహ్ యొక్క అసలు ధర్మం నుండి తొలిగిపోయి, అజ్ఞానం వైపుకు తీసుకుపోతాయి. దీని గురించి ఖుర్ఆన్ లో అల్లాహ్ యొక్క ప్రకటన ఇలా ఉన్నది: ఖుర్ఆన్ వచన భావానువాదం,

**"మరియు వారు అల్లాహ్ ను కాదని తమకు నష్టం గానీ, లాభం గానీ కలిగించలేని వాటిని ఆరాధిస్తున్నారు. మరియు వారు ఇలా అంటున్నారు: 'వీరు మాకు అల్లాహ్ వద్ద సిఫారసు చేసేవారు....' "** (యూనుస్ 10: 18).

**"ఇక ఆయనను వదలి ఇతరులను సంరక్షకులుగా చేసుకునేవారు (ఇలా అంటారు): 'వారు మమ్మల్ని అల్లాహ్ సాన్నిధ్యానికి చేర్చుతారని మాత్రమే మేము వారిని ఆరాధిస్తున్నాము.' "** (అజ్జుమర్ 39: 3).

ఇలాంటి నూతన కల్పితాలు (బిదాఅలు) కొనసాగింపబడాలని భావించేవారు చాలా విస్తృతమైన వాదనలు చేస్తారు. అవి సాలెగూడు కంటే జటిలంగా, క్లిష్టంగా ఉంటాయి. వాటి వాస్తవికత ఇలా ఉంది:

1 – మిలాదున్నబీ జరపటమనేది ప్రవక్త (ﷺ) ను గౌరవించటంలో భాగమని వారు వాదిస్తారు:

దీనికి మా సమాధానం – ప్రవక్త (ﷺ) ను గౌరవించటమంటే ఆయనను విధేయతగా అనుసరించటం. ఆయన ఆజ్ఞాపించిన వాటిని ఆచరించటం, ఆయన నిషేధించిన వాటి నుండి దూరంగా ఉండటం మరియు ఆయనను ప్రేమించటం; అంతేగాని నూతన కల్పితాచరణల ద్వారా, కాల్పనిక పనుల మరియు పాపకార్యాల ద్వారా ఆయనను గౌరవించటం కాదు. మిలాదున్నబీ వేడుక అలాంటి అనర్థమైన వాటి క్రిందికే వస్తుంది, ఎందుకంటే అది ఒక పాపకార్యం. ఖురైషీయులకు ఉర్వహ్ ఇబ్నె మస్ఊద్ రదియల్లాహు అన్హు చెప్పినట్లు, ప్రవక్త (ﷺ) ను అత్యంత అధికంగా గౌరవించింది, ఆయన సహచరులైన సహాబాలే (రదియల్లాహు అన్హుమ్): ఉర్వహ్ రదియల్లాహు అన్హు యొక్క పలుకులు -

"ఓ ప్రజలారా! అల్లాహ్ సాక్ష్యంగా నేను రాజులను సందర్శించాను. సీజర్, ఛస్రోస్ మరియు నెగస్ ల వద్దకు వెళ్ళాను. కానీ, అల్లాహ్ సాక్షిగా చెబుతున్నాను – ముహమ్మద్ సహచరులు ముహమ్మద్ ను గౌరవిస్తున్నంత అధికంగా ఏ రాజు గౌరవించబడటాన్ని, నేనెన్నడూ చూడలేదు. అల్లాహ్ సాక్షిగా, ఆయన వేసే ఉమ్మి భూమిపై పడక ముందే, ఆయన సహచరులలో నుండి ఎవరో ఒకరు దానిని తమ చేతిలో చేజిక్కించుకుంటారు. దానిని తమ ముఖానికి, తమ శరీరానికి తుడుచుకుంటారు. ఒకవేళ ఆయన, వారిని

ఏదైనా పని చేయమని ఆజ్ఞాపిస్తే, వెంటనే వారు ఆ ఆజ్ఞను పూర్తి చేయటానికి పరుగెత్తుతారు. ఆయన వదూ చేసినపుడు, ఆ నీళ్ళను చేజిక్కించుకోవటానికి వారు చేసే ప్రయత్నం, దాదాపుగా వారిలో వారు పోట్లాడుకుంటున్నట్లు కనబడుతుంది. ఆయన సమక్షంలో మాట్లాడేటప్పుడు, తమ స్వరాన్ని తగ్గించి మరీ మాట్లాడతారు; ఆయనపై ప్రేమాభిమానాల కారణంగా, వారు ఆయన చూపులతో తమ చూపులను కలుపరు." (బుఖారీ)

ఆయనపై వారు ఇంత ఎక్కువగా గౌరవం చూపినప్పటికీ; ఆయన జన్మదినాన్ని, ఇలాంటి మిలాదున్నబీ వేడుకలతో వారేనాడూ జరుపుకోలేదు. ఒకవేళ మిలాదున్నబీ వేడుకలకు ఇస్లాంలో అనుమతి ఉంటే, వాటిని జరుపుకోవటంలో వారు అస్సలు నిర్లక్ష్యం చేసేవారు కాదు కదా!.

2 – అనేక దేశాలలో, అనేక మంది ప్రజలు మిలాదున్నబీ వేడుకలు జరుపు కోవటాన్ని, అది ధర్మబద్ధమనటానికి నిదర్శనంగా వారు చూపుతారు.

దీనికి మా సమాధానం – ప్రవక్త (ﷺ) నుండి నిరూపించబడిన ఆచరణలు మాత్రమే ధర్మసమ్మతమైనవి. నూతన కల్పితాలు నిషేధించబడినాయనే ప్రవక్త (ﷺ) ఆదేశం స్పష్టంగా ఉంది. మరి ఇదే నియమం మిలాదున్నబీ పండుగకు కూడా వర్తిస్తుంది. ప్రజలు ఏమి చేసినా, ఎంత ఎక్కువ మంది కలిసి చేసినా సరే – ఒకవేళ అది స్పష్టమైన సాక్ష్యాధారాలకు (దలీలుకు) విరుద్ధంగా ఉంటే, వారి ఆచరణ, ధర్మసమ్మతమైన ఆచరణగా పరిగణించబడదు. దీని గురించి, ఖుర్ఆన్ లోని అల్లాహ్ పలుకుల భావానువాదం ఇలా ఉంది:

**"మరియు (ఓ ముహమ్మద్) ఒకవేళ నీవు భూమిపై అనేకులను అనుసరించి నట్లయితే, వారు నిన్ను అల్లాహ్ మార్గం నుండి మార్గభ్రష్టుడిని చేస్తారు. వారు కేవలం ఊహలనే అనుసరిస్తారు. వారు ఊహాగానాలు చేయడం తప్ప ఇంకేమీ చేయరు." (ఖుర్ఆన్ 6: 116)**

ఏదేమైనా, ప్రతికాలంలోనూ, అల్లాహ్ కృప వలన దీనిని కల్పితాచరణగా (బిదాఅగా) నిరసించేవారు మరియు అసత్యమైనదిగా స్పష్టపరచేవారు ఉంటూనే ఉన్నారు. సత్యం తెలిసిన తరువాత కూడా దానిని జరుపుకోవటం పైనే మొండిగా పట్టు పట్టేవారి వద్ద, తమ కల్పితాచరణలను నిరూపించే ఏ నిదర్శనమూ లేదు.

ఈ మిలాదున్నబీ వేడుకలను తిరస్కరించినవారిలో షేఖుల్ ఇస్లాం ఇబ్నె తైమియాహ్ (ఇఖ్తిదాఅ అల్ సిరాత్ అల్ ముస్తఖీమ్), ఇమామ్ అల్ షాతిబి (అల్ ఇత్తిసామ్), ఇబ్నె అల్ హాజ్ (అల్ మద్ఖల్), షేఖ్ తాజుద్దీన్ అలీ ఇబ్నె ఉమర్ అల్ లఖామీ (దీనిని తిరస్కరిస్తూ మొత్తం పుస్తకాన్నే వ్రాసారు), షేఖ్ ముహమ్మద్ బషీర్ అల్ సహస్వాని అల్ హిందీ (సియానహ్ అల్ ఇన్సాన్), అల్ సయ్యిద్ ముహమ్మద్ రషీద్ రిదా (దీనిపై పూర్తి వ్యాసాన్ని వ్రాసారు), షేఖ్ ముహమ్మద్ ఇబ్నె ఇబ్రాహీమ్ అలీ అష్షేఖ్ (దీనిపై పూర్తి వ్యాసాన్ని వ్రాసారు), షేఖ్ అబ్దుల్ అజీజ్ ఇబ్నె బాజ్ మరియు ఇతరులు. ఈ కల్పిత ఆచరణ బాగా ఎక్కువగా వ్యాపించిన ఈ కాలంలో కూడా దీనిని నిరసిస్తూ ప్రతి సంవత్సరం వార్తాపత్రికలలో, మాగజైనులలో అనేక మంది వ్యాసాలు వ్రాస్తున్నారు.

### 3 – మిలాదున్నబీ వేడుకలు జరపటమనేది ప్రవక్త (ﷺ) జ్ఞాపకాన్ని తాజాగా ఉంచుతుందని వారు వాదిస్తారు.

దీనికి మా సమాధానం – అదాన్, అఖామత్ మరయు జుమఅ ఖుత్బాలలో ఉచ్ఛరించబడటం ద్వారా; వదూ చేసిన ప్రతిసారీ షహాదా ప్రకటనలో ఆయన పేరు ఉచ్ఛరించటం, నమాజులో ఆయనపై సలాం పంపటం ద్వారా; ప్రవక్త (ﷺ) సూచించిన వాజిబ్ (తప్పనిసరి) లేదా ముస్తబహ్ (ఉత్తమ) సున్నతులు అనుసరించటం ద్వారా, ముస్లింలలో ప్రవక్త (ﷺ) జ్ఞాపకం ఎల్లప్పుడూ తాజాగా ఉంచబడు తున్నది. పై ఆచరణలన్నింటిలో ముస్లింలు ఆయనను జ్ఞాపకం చేసుకుంటూ ఉంటారు. అలా చేయటం ద్వారా వారికి లభించే ప్రతిఫలానికి సరిసమానమైన ప్రతిఫలం ప్రవక్త (ﷺ) కు కూడా ప్రసాదించబడుతూ ఉంటుంది.

ముస్లింలు నిరంతరం ఆయన (ﷺ) జ్ఞాపకాన్ని అలా సజీవంగా ఉంచుకోవచ్చు. అల్లాహ్ తెలిపిన పై పద్ధతులలో ప్రవక్త (ﷺ) ను గౌరవిస్తూ, తమ జీవితాంతం, రాత్రీపగలూ, ఆయన (ﷺ) జ్ఞాపకాల్ని తాజాగా ఉంచుకోవచ్చును. మిలాదున్నబీ రోజున జరిగే వేడుకలు మరియు వాటిలోని కల్పిత ఆచరణలు (బిదాఅలు) సున్నతులకు విరుద్ధమైనవి. ఇలాంటి దారి తప్పిన పనులు, ప్రవక్త (ﷺ) సమీపానికి చేర్చే బదులు, ఆయన (ﷺ) నుండి దూరంగా తీసుకుపోతాయి. ఇలాంటి మార్గభ్రష్టమైన పనుల కారణంగా ప్రవక్త (ﷺ) వారిని ఇష్టపడరు కూడా.

ఇటువంటి కల్పిత వేడుకల అవసరం ప్రవక్త (ﷺ) కు లేదు. ఎందుకంటే ఆయనకు గౌరవాన్ని మరియు ప్రేమాభిమానాలను స్వయంగా అల్లాహ్ యే ప్రసాదించాడని ఖుర్ఆన్ లోని ఈ ఆయతు ద్వారా స్పష్టమవుతున్నది:

**"మరియు నీ పేరు ప్రతిష్ఠలను పైకెత్తలేదా?"** (అష్ షరహ్ 94: 4)

ప్రవక్త (ﷺ) పేరు వెంటలేకుండా, ఒంటరిగా అల్లాహ్ యొక్క పేరు అదాన్, అఖామత్ లేదా ఖుత్బాలో ప్రస్తావించబడదు; ఆయనపై గౌరవం మరియు ప్రేమాభిమానాలు చూపటానికి మరియు ఆయన (ﷺ) జ్ఞాపకాలను తాజాగా ఉంచటానికి, ఆయనను అనుసరించేటట్లు ప్రోత్సహించటానికి అది చాలు. అంతేకాదు అల్లాహ్ మిలాదున్నబీ వేడుకల గురించి ఖుర్ఆన్ లో ఎక్కడా ప్రసావించలేదు. కానీ, అల్లాహ్ ఖుర్ఆన్ లో, ఆయన (ﷺ) పంపబడిన అసలు లక్ష్యం గురించి ఇలా ప్రకటించాడు:

**"వారి నుంచే ఒక ప్రవక్తను వారిలో పంపినప్పుడు, నిజానికి అల్లాహ్ విశ్వాసులకు మహోపకారం చేసాడు. ఆ ప్రవక్త వారికి ఆయన ఆయాతులను చదివి వినిపిస్తాడు, వారిని పరిశుద్ధపరుస్తాడు, వారికి దివ్యగ్రంథాన్నీ మరియు వివేకాన్నీ బోధిస్తాడు. నిశ్చయంగా, అంతకు పూర్వం వారు స్పష్టమైన మార్గభ్రష్టత్వంలో పడి ఉండేవారు."** (3: 164)

**"ఆయనే నిరక్షరాస్యులైన వారిలో నుండి ఒక సందేశహరుడిని లేపాడు."** (అల్ జుమఅహ్ 62: 2).

4 – అల్లాహ్ కు సమీపం కావాలనే సదుద్దేశంతో ప్రవక్త (ﷺ) జన్మదిన వేడుకలను ఇస్లాం ధర్మజ్ఞానం కలిగిన, ఒక న్యాయవంతుడైన రాజు పరిచయం చేసాడని వారు వాదిస్తారు.

దీనికి మా సమాధానం – అది ఎవరు చేసినప్పైనా సరే, కల్పితాచరణలు (బిదాఅ) స్వీకరించబడవు. మంచి ఉద్దేశం చెడు పనిని మంచి పనిగా మార్చలేదు. ఒకవేళ ఎవరైనా వ్యక్తి ఇస్లామీయ పండితుడిగా మరియు సజ్జనుడిగా చనిపోతే, అతను పుణ్యాత్ముడని, పాపాలేమీ చేయలేదని భావించలేము గదా!

5 – మిలాదున్నబీ వేడుకలు జరుపుకోవటమనేది బిదాఅ హస్నహ్ (మంచి నూతన కల్పిత ఆచరణ) క్రిందికి వస్తుందని వారు వాదిస్తారు. ఎందుకంటే దీని ఆధారం - ప్రవక్త (ﷺ) గురించి, అల్లాహ్ కు కృతజ్ఞతలు తెలుపటం!

దీనికి సమాధానం – నూతన కల్పితాచరణలలో ఎలాంటి శుభమూ ఉండదు. దీని గురించి ప్రవక్త (ﷺ) ఇలా అన్నారు: "మా యొక్క ఈ విధానంలో (ఇస్లాంలో) ఏదైనా నూతన విషయం కల్పిస్తే, అది దానిలో భాగంగా కలిసిపోదు మరియు తిరస్కరించబడుతుంది." (బుఖారీ)

మరియు ఆయన (ﷺ)ఇలా అన్నారు: "ప్రతి నూతన కల్పితం (బిదఅ) మార్గభ్రష్టత్వం వైపుకు తీసుకుపోతుంది." (అహ్మద్ & అత్తిర్మిధీ)

ఇస్లామీయ ధర్మాదేశం ప్రకారం నూతన కల్పిత ఆచరణలన్నీ మార్గభ్రష్టమైనవే. అయినా వాటిలో కొన్ని మంచివి కూడా ఉన్నాయి కదా అని వారు వాదిస్తారు.

ఇబ్నె రజబ్ రహిమహుల్లాహ్ ఇలా అన్నారు: " 'ప్రతి నూతన కల్పితం మార్గభ్రష్టత్వం వైపుకు తీసుకుపోతుంది' అనే ప్రవక్త (ﷺ) పలుకులు క్లుప్తమైనవే కాకుండా సర్వగ్రాహ్యమైనవి కూడా; ఇది ధర్మపు ఒక ముఖ్యమైన నియమం.

దీని తీవ్రతను సూచించే ఆయన యొక్క మరో ఆదేశం ఇలా ఉన్నది: "మా యొక్క ఈ విధానంలో (ఇస్లాంలో) ఏదైనా నూతన విషయం కల్పిస్తే, అది దానిలో భాగంగా కలిసిపోదు మరియు తిరస్కరించబడుతుంది." (బుఖారీ)

ఎవరైనా ఏదైనా నూతన కల్పితాచరణ కనుగొని, ఎలాంటి ప్రామాణిక సాక్ష్యాధారాలు లేకుండానే దానిని ఇస్లాంలో చేర్చాలను కుంటే, అది వినాశనం వైపుకే తీసుకుపోతుంది మరియు ఇస్లాంతో దానికేమీ సంబంధం లేదు - అది విశ్వాసానికి (అఖీదహ్ కు) సంబంధించినదైనా సరే; లేదా బహిరంగ, రహస్య పలుకులు, ఆచరణలకు సంబంధించినదైనా సరే."

ఇలాంటి ప్రజల వద్ద, తరావీహ్ నమాజుల గురించి ఉమర్ రదియల్లాహు అన్హు యొక్క ఈ పలుకులు తప్ప, మరే ఇతర ప్రామాణిక ఆధారమూ కనబడదు:

'ఎంత మంచి బిదాఅ (కల్పితం).' (బుఖారీ)

ఇంకా ఖుర్ఆన్ భాగాలను ఒకే గ్రంథంగా జమ చేయటం; హదీథులు వ్రాయటం, సేకరించటం మరియు సంకలనం చేయటం మొదలైన పనులను సలఫ్ (ముందు తరం ముస్లింలు) తిరస్కరించలేదు కదా అని కూడా వారు వాదిస్తారు.

వాటి ఈ మాటలకు సమాధానం ఏమిటంటే వీటికి ఇస్లాంలో ఆధారం ముందు నుండే ఉంది, అవి నూతనంగా కనుగొనబడిన ఆచరణలు కావు. 'ఉమర్ రదియల్లాహు అన్హు యొక్క 'ఎంత మంచి బిదాఅ' అనే మాటలలో వాడబడిన బిదాఅ అనే పదాన్ని భాషాపరంగా తీసుకోవాలే గాని షరిఅత్ పరంగా (ఇస్లామీయ ధర్మాజ్ఞలనుసారం) కాదు. ఇస్లాంలో సరైన ఆధారాలు ఉన్న విషయం ఒకవేళ ఎక్కడైనా 'బిదాఅ' అనే పేరుతో పేర్కొనబడితే, ఆ 'బిదాఅ' అనే పదాన్ని భాషాపరంగా తీసుకోవాలే గాని షరిఅత్ పరంగా కాదు. ఎందుకంటే షరిఅహ్ పరంగా బిదాఅ అంటే 'ఇస్లాం ధర్మంలో ఏ ఆధారమూ లేనిదని' అర్థం.

ఖుర్ఆన్ ను ఒకే గ్రంథంగా జమ చేయటమనే దానికి ఇస్లాంలో ఆధారం ఉన్నది. ఎందుకంటే ఖుర్ఆన్ ఆయతులను వ్రాయమని ప్రవక్త (ﷺ) స్వయంగా కొందరు సహచరులకు ఆజ్ఞాపించి ఉన్నారు. ప్రజల వద్ద విడివిడిగా ఉన్న ఖుర్ఆన్ ఆయతులను సహాబాలు ఒకచోటకు చేర్చి, అవి సురక్షితంగా మరియు జాగ్రత్తగా ఉండేందుకు గాను, వాటిని ఒక గ్రంథరూపంలో సంకలనం చేసారు.

కొన్నిసార్లు తరావీహ్ నమాజులలో ప్రవక్త (ﷺ) తన సహచరులకు ఇమామత్ చేసి, అది వారిపై విధిగా అయిపోతుందేమోననే భయం వలన, తరావీహ్ నమాజు చదివించటం నిలిపివేసారు. ప్రవక్త (ﷺ) జీవితకాలంలో మరియు ఆయన మరణం తరువాత కూడా సహాబా రదియల్లాహు అన్హుమ్ లు విడివిడిగా తరావీహ్ నమాజు చేస్తూ ఉండేవారు. చివరికి ఉమర్ బిన్ ఖత్తాబ్ రదియల్లాహు అన్హు, ప్రవక్త (ﷺ) వెనుక కొన్నిసార్లు తరావీహ్ నమాజు చేసిన పద్ధతినే అనుసరిస్తూ, ప్రజలను ఒకే ఇమాం నాయకత్వంలో తరావీహ్ నమాజు చేయటం కొరకు జమ చేసారు. కాబట్టి, ఇది ఇస్లాంలో కొత్తగా చేర్చబడిన బిదాఅ క్రిందికి రాదు.

హదీథులు ఒకచోట సమకూర్చబడటానికి కూడా ఇస్లాం ధర్మంలో ఆధారాలు ఉన్నాయి. హదీథులు నమోదు చేసేందుకు అనుమతించమని కొందరు సహాబాలు అడిగినపుడు, ప్రవక్త (ﷺ) వారికి అనుమతినిచ్చారు. ఆయన జీవితకాలంలో సాధారణంగా హదీథుల నమోదు నిషేధించబడింది. దీనికి కారణం - ఖుర్ఆన్ ఆయతులు, ఖుర్ఆన్ ఆయతులు కాని వాటితో అంటే హదీథులతో కలిసిపోవచ్చనే భయం. అయితే ప్రవక్త (ﷺ) మరణించిన తరువాత, అలా భయపడవలసిన అవసరం లేకపోయింది. ఎందుకంటే అప్పటికే, అంటే ఆయన మరణించక ముందే ఖుర్ఆన్ అవతరణ పూర్తయిపోయింది. దాని క్రమపద్ధతి కూడా నిర్ధారించబడింది. ఆ తరువాత సున్నతులను కాపాడు కోవటం కొరకు, ముస్లింలు వాటిని జమ చేసి, భద్రపరచటం పై దృష్టిసారించారు. అల్లాహ్ వారందరికీ ఇస్లాం తరుఫున మరియు ముస్లింల తరుఫున మంచి ప్రతిఫలం ప్రసాదించుగాక! ఎందుకంటే వారు తమ ప్రభువు గ్రంథాన్ని మరియు

తమ ప్రవక్త (ﷺ) సున్నతులును పోగొట్టుకోకుండా, మార్పులు – చేర్పులకు గురికానివ్వకుండా జాగ్రత్తగా భద్రపరచినారు.

ఇంకా మనం వారి దృష్టికి ఈ మాట కూడా తీసుకురావచ్చు: ప్రవక్త (ﷺ) పై అత్యధికంగా ప్రేమాభిమానాలు చూపిన అత్యుత్తమ సహాబాల తరం, వారి తరువాత వచ్చిన తాబయీనుల తరం, ఆ తరువాత వచ్చిన తాబయీన్ అనుచరుల తరం ప్రవక్త (ﷺ) నకు కృతజ్ఞతలు తెలిపే ఉద్దేశంతో ఇలాంటి మిలాదున్నబీ ఉత్సవాలు జరపనపుడు, మనం వాటిని ఎందుకు జరపాలి? మిలాదున్నబీ ఉత్సవాలను పరిచయం చేసిన వారు, పైన పేర్కొనబడిన ఉత్తమ తరాల ప్రజల కంటే అధికంగా సరైన మార్గదర్శకత్వం పొందినారా? ఉత్తమ తరాల ప్రజల కంటే అధికంగా వారు అల్లాహ్ కు కృతజ్ఞతలు సమర్పించుకున్నారా? ముమ్మాటికీ కాదు!

6 – ప్రవక్త (ﷺ) యొక్క మిలాదున్నబీ జన్మదిన వేడుకలు జరుపుకోవటమనేది ఆయనపై వారు చూపుతున్న ప్రేమాభిమానాలను సూచిస్తుందని; మిలాదున్నబీ వేడుకలు ఆ ప్రేమాభిమానాలను ప్రదర్శించే ఒక పద్ధతని మరియు ప్రవక్త (ﷺ) పై ప్రేమాభిమానాలు ప్రదర్శించుట ఇస్లాంలో నిర్దేశించబడిందని వారు వాదిస్తారు.

నిస్సందేహంగా ప్రవక్త (ﷺ) ను ప్రేమించుట ప్రతి ముస్లింపై ఉన్న తప్పనిసరి విధి; స్వంత ప్రాణం కంటే అధికంగా మరియు తన సంతానం, తల్లిదండ్రులు మరియు మొత్తం మానవజాతి కంటే అధికంగా ప్రతి ఒక్కరూ ఆయనను ప్రేమించాలి – నా తల్లిదండ్రులను ఆయన కొరకు నేను త్యాగం చేయుగాక – అయితే, ఆయనను అలా ప్రేమించటం కొరకు మనం ఇస్లాంలో నిర్ధేశింపబడని నూతన కల్పితాలను (బిదాఅలను) కనిపెట్టకూడదు. ఆయనపై ప్రేమాభిమానాలు చూపటమనేది, ఆయనకు విధేయత చూపటాన్నీ మరియు అనుసరించుటాన్నే ఆజ్ఞాపిస్తున్నది. అదే ఆయనపై ప్రేమాభిమానాలు చూపే అత్యుత్తమమైన పద్ధతి. దీని గురించి ఇలా చెప్పబడింది: “ఒకవేళ మీ ప్రేమాభిమానాలు నిష్కపటమైనవైతే, ఆయనకు

విధేయత చూపండి; ఎందుకంటే ప్రేమించేవాడు, తను ప్రేమిస్తున్న వానికి పూర్తి విధేయత చూపుతాడు.''

ప్రవక్త (ﷺ) ను ప్రేమించటమంటే, ఆయన సున్నతులను సజీవంగా ఉంచటం, వాటిని దృఢంగా, నిలకడగా అనుసరించటం మరియు సున్నతులకు వ్యతిరేకమైన అన్ని రకాల మాటలు మరియు పనులకు దూరంగా ఉండటం. నిస్సందేహంగా, ఆయన సున్నతుకు విరుద్ధంగా పోయేదేదైనా సరే, అది తప్పకుండా తిరస్కరించబడే దురాచారం మరియు ఆయనకు అవిధేయత చూపే ఆచరణయే అవుతుంది. మిలాదున్నబీ జన్మదిన వేడుకలు జరుపుకోవటం మరియు ఇతర బిదాఅలు అంటే నూతన కల్పితాలు ఇలాంటి దురాచారముల మరియు అవిధేయత క్రిందికే వస్తాయి. 'మంచి సంకల్పం', ధర్మంలో బిదాలను అంటే నూతన కల్పితాలను చేర్చటానికి అనుతిస్తుందని భావించకూడదు. ఇస్లాం ధర్మం రెండింటిపై ఆధారపడి ఉంది – సంకల్పంలోని చిత్తశుద్ధి మరియు ప్రవక్త (ﷺ) యొక్క అనుసరణ. కేవలం ఒక్క మంచి సంకల్పంపై మాత్రమే కాదు.

దీనికి సంబంధించిన ఖుర్ఆన్ వచన భావానువాదం:

> **"నిజానికి ఎవరైతే తన ముఖాన్ని (తన అభీష్టాన్ని) అల్లాహ్ కు అంకితం చేసి, ముహ్సిన్ (సత్కార్యాలు చేసేవాడు) గా ఉండునో, అతని ప్రతిఫలం అతని ప్రభువు వద్ద ఉన్నది. అటువంటి వారికి ఎలాంటి భయమూ లేదు మరియు వారు ఏ విధంగానూ దు:ఖపడరు." (ఖుర్ఆన్ 2: 112)**

తమ ముఖాన్ని ప్రభువుకు అంకితం చేయటమంటే చిత్తశుద్ధితో, నిష్కపటంగా అల్లాహ్ కు సమర్పించుకోవటం. సత్కార్యాలు చేయటమంటే, ప్రవక్త (ﷺ) ను అనుసరించటం మరియు ఆయన సున్నతులను ఆచరణలో పెట్టడం.

7 – వారి మరొక విస్తృతమైన వాదన ఏమిటంటే – మిలాదున్నబీ ఉత్సవాలు జరపటం మరియు వాటిలో ప్రవక్త (ﷺ) యొక్క జీవిత చరిత్ర చదవటం ద్వారా ఆయన సున్నతుల వైపు తాము ప్రజలను ప్రోత్సహిస్తున్నామని వాదించటం!

వారికి మా సమాధానం – ప్రతి ముస్లిం ఎల్లప్పుడూ, సంవత్సరం పొడుగునా మరియు తన జీవితాంతం ప్రవక్త ముహమ్మద్ (ﷺ) యొక్క జీవితచరిత్ర చదవవలసిన మరియు ఆయన ఉదాహరణలను అనుసరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది. ఎలాంటి ఇస్లామీయ ఆధారాలు లేకుండా, ఒక దినాన్ని దాని కొరకు ప్రత్యేకించడం బిదఅ (కల్పితాచరణ) క్రిందికి వస్తుంది, మరియు "ప్రతి నూతన కల్పితం (బిదఅ) మార్గభ్రష్టత్వం వైపుకు తీసుకుపోతుంది." (అహ్మద్ & అత్తిర్మిధీ)

నూతన కల్పితం (బిదఅ) చెడు ఫలితాన్ని తప్ప, ఎలాంటి మంచి ప్రతిఫలాన్నీ ఇవ్వదు. అది ఆ వ్యక్తిని ప్రవక్త (ﷺ) నుండి దూరం చేస్తుంది.

ఇక చివరిగా ప్రవక్త ముహమ్మద్ (ﷺ) యొక్క మిలాదున్నబీ జన్మదిన వేడుకలు జరుపుకోవటమనేది, అది ఏ రూపంలోనైనా సరే - ఒక గర్హనీయమైన బిదఅ (నూతన కల్పితం). దీనిని మరియు ఇలాంటి ఇతర బిదఅలను ముస్లింలు నిలిపి వేసి, తమను తాము సరిదిద్దుకోవటంలో మరియు సున్నతులను మనస్ఫూర్తిగా అనుసరించటంలో నిమగ్నం కావాలి. ఈ బిదఅను ప్రోత్సహిస్తున్న మరియు సమర్థిస్తున్న ప్రజల మాయలో పడిపోకూడదు. ఎందుకంటే అలాంటి వంచకులు బిదఅలను (కల్పితాలను) సజీవంగా ఉంచటానికి ఎక్కువగా ఇష్టపడతారే గాని ప్రామాణిక సున్నతులను పునరుద్ధరించటంలో అంతగా ఆసక్తి చూపరు; ఒక్కోసారి వారు సున్నతుల గురించి అస్సలు పట్టించుకోరు కూడా. ఒకవేళ మీ చుట్టుప్రక్కల అలాంటి వారు మెజారిటీ సంఖ్యలో ఉన్నా సరే - అలాంటి వారిని అనుకరించటం లేదా అనుసరించటం అనుమతింపబడలేదు. అయితే, సంఖ్యలో తక్కువగా ఉన్నా సరే - సజ్జనులైన సలఫ్ (ముందుతరం ముస్లింలు) మరియు

వారి అనుచరులలో నుండి సున్నతులపై నడిచే వారినే మనం అనుసరించాలి. సత్యం పలికే వ్యక్తుల సంఖ్యను బట్టి సత్యం లెక్కించబడదు. కానీ, వారు పలికే సత్యాన్ని బట్టి వ్యక్తులు లెక్కించబడతారు.

ఒకసారి ప్రవక్త (ﷺ) ఇలా అన్నారు: "మీలో (ఎక్కువ కాలం) జీవించి ఉన్నవారంతా అనేక భేదాలను చూస్తారు. నా సున్నతులను మరియు నా తరువాత వచ్చే ఖులఫాయే రాషిదీనుల (సన్మార్గంలో నడిచిన ఖలీఫాల) మార్గాన్ని అనుసరించమని నేను విజ్ఞప్తి చేస్తున్నాను. ఆ మార్గాన్ని దృఢంగా పట్టుకోండి. నూతన కల్పితాల (బిదాఅల) గురించి జాగ్రత పడండి, ఎందుకంటే ప్రతి నూతన కల్పితం (బిదాఅ) దారితప్పిస్తుంది." (అహ్మద్ & అత్తిర్మిథీ)

కాబట్టి, అభిప్రాయ భేదాలు ఏర్పడినపుడు ఏమి చేయాలనే విషయాన్ని ఈ హదీథు ద్వారా ప్రవక్త (ﷺ) మనకు వివరించారు. అనగా ఆయన సున్నతుకు భిన్నంగా పోయే ఎలాంటి పలుకైనా లేదా ఆచరణ అయినా సరే, అది నూతన కల్పితం (బిదాఅ) క్రిందికి వస్తుంది. మరియు ప్రతి నూతన కల్పితం (బిదాఅ) మార్గభ్రష్టత్వం వైపునకు తీసుకుని పోతుంది.

సున్నతులలో లేదా ముందుతరం ఖలీఫాల పద్ధతిలో ప్రవక్త (ﷺ) యొక్క మిలాదున్నబీ జన్మదిన వేడుకలు జరపటం గురించిన ఏ ఆధారమూ మనకు కనబడకపోవటం వలన, అది ప్రజలను మార్గభ్రష్టత్వం వైపుకు తీసుకుని పోయే నూతన కల్పితమే (బిదాఅ) అవుతుంది. ఈ అర్థాన్నే పై హదీథు మరియు క్రింది ఆయతు యొక్క భావానువాదం స్పష్ట పరుస్తున్నాయి:

"ఓ విశ్వాసులారా! అల్లాహ్ పట్ల ఆజ్ఞానువర్తనులై వ్యవహరించండి మరియు ఆయన సందేశహరుని పట్ల ఆజ్ఞానువర్తనులై వ్యవహరించండి, అలాగే మీలో నుంచి అధికారంలో ఉన్న వారి పట్ల కూడా; అపుడు ఒకవేళ ఏదైనా విషయంలో మీరు విభేదించినట్లయితే, దానిని అల్లాహ్ మరియు

**ఆయన సందేశహరుని వైపునకు మళ్ళించండి – మీరు అల్లాహ్ ను మరియు అంతిమ దినాన్ని విశ్వసించేవారే అయితే. ఇదే మీ కొరకు శుభప్రదమైనది మరియు దీని పర్యవసానం కూడా చాలా శ్రేష్ఠమైనది..” (ఖుర్ఆన్ 4: 59)**

అల్లాహ్ వైపు మళ్ళించడం అంటే ఆయన యొక్క అంతిమ దివ్యగ్రంథమైన ఖుర్ఆన్ వైపుకు నిర్దేశించడం అనీ మరియు ఆయన సందేశహరుని (ﷺ) వైపు మళ్ళించడం అంటే ఆయన మరణానంతరం, ఆయన సున్నతు వైపు నిర్దేశించడం అని అర్థం. కాబట్టి, భిన్నాభిప్రాయాలు వచ్చినపుడు, వాటిని ఖుర్ఆన్ మరియు సున్నతుల ఆధారంగానే పరిష్కరించుకోవాలి. మరి, ప్రవక్త (ﷺ) యొక్క మిలాదున్నబీ జన్మదిన వేడుకలు జరపాలని ఖుర్ఆన్ లేదా సున్నతులో ఎక్కడ సూచించబడి ఉన్నది? మిలాదున్నబీ వేడుకలు జరపటం మంచిదని భావించేవారు, వెంటనే దాని నుండి మరియు అలాంటి ఇతర నూతన కల్పితాల (బిదాఅల) నుండి అల్లాహ్ వద్ద తౌబా చేసుకోవలెను. సత్యాన్వేషణ చేసే ముస్లిం పాటించవలసిన విధానం ఇదే. కానీ, సత్యం ముందుకు వచ్చిన తరువాత కూడా ఎవరైతే మరీ మొండిగా, మూర్ఖంగా, అహంకారంతో ప్రవర్తిస్తారో, అలాంటి వారి లెక్క తప్పకుండా వారి ప్రభువు వద్ద ఉన్నది.